క్లుప్తంగా

నేడు చండీహోమం



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 12వ తేదీ శనివారం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. చైత్రపౌర్ణమిని పురస్కరించుకుని 74వ చండీ హోమం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి సుమారు ఇరవై ఐదు కేజీల వెండితో వెండి చీర తయారు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా మారిశెట్టి చిన్న సూర్య ప్రకాష్, లక్ష్మి దంపతులు 10 తులాల వెండిని, కాటేపల్లి శ్రీనివాసరావు, పద్మజ దంపతులు 5 తులాల వెండిని, గౌతు నాగరాజు పార్వతి దంపతులు 5 తులాల వెండిని సమర్పించారని రాజాన సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

కొయ్యలగూడెం: మంగపతీదేవిపాలెం గ్రామంలో శుక్రవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వాడపల్లి దామోదరరావు సౌజన్యంతో, మాజీ సర్పంచ్ వాడపల్లి రాధాకృష్ణ బ్రదర్స్ ఆధ్వర్యంలో ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం పరిసర గ్రామ ప్రాంతాలకు చెందిన ఐదువేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాజవరం పంచాయతీ పరిధిలోని శివారు గ్రామమైన మంగపతీదేవి పాలెంలో 1972లో రామాలయాన్ని నిర్మించగా ఇపుడు ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొయ్యలగూడెం: స్వామి అయ్యప్ప జన్మదినోత్సవం శుక్రవారం టెంపుల్స్ సెంటర్‌లో అయ్యప్ప స్వామి మందిరంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం వివరణ కార్యక్రమం చేశారు.


ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

బుట్టాయగూడెం: మండలంలోని కుమ్మరిగట్టు వద్ద నిర్మించనున్న శ్రీరమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఈ నిర్మాణానికి సంబంధించి పోస్టర్లను శుక్రవారం సాయంత్రం విజయ గణపతి ఆలయం వద్ద స్థలదాత ఆలపాటి దుర్గారావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొండేపాటి రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో పురోహితులు అనిపెద్ది రామకృష్ణ శర్మ, గ్రామ పెద్దలు దొమ్మేటి లక్ష్మీజనార్ధన్, దొమ్మేటి సత్యనారాయణ, ప్రగడ సూరిబాబు, కమిటీ సభ్యులు పెనుగుర్తి సోంబాబు, కోసూరి నరేష్, దంగేటి కరుణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీవో

లింగపాలెం: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏపీవో వరలక్ష్మి సిబ్బందికి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఏపీవో సింగగుడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఉపాధి సిబ్బంది, కూలీలకు పని కొలతలు చూపించి పనిని కేటాయించాలని ఆమె తెలిపారు.

మత్తులో ముంచి ప్రాణాలు తీస్తున్నారు!

- బెల్టు షాపులకు తెరలేపిన కూటమి సర్కారు
- తాగినోడికి తాగినంత.. విచ్చలవిడిగా విక్రయాలు
- ఒక్కో షాపుకు రూ.లక్ష వసూలు..
- భగ్గుమంటున్న గ్రామస్తులు



మద్యానికి బానిసై అనారోగ్యంతో మృతి చెందిన వంశీ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న గ్రామస్తులు

బుట్టాయగూడెం: గిరిజన గ్రామాల్లో బెల్టుషాపులు జోరుగా సాగుతున్నాయి. గ్రామానికి మూడు చొప్పున బెల్టుషాపులు ఏర్పాటు చేసి తాగినోడికి తాగినంత అన్నట్లుగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. ఎంఆర్‌పీ రేట్ల కంటే ఎక్కువగా మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చేసే ప్రకటనలు వాస్తవ రూపాన్ని దాల్చడం లేదు. దీనికి విరుద్ధంగా గ్రామాల్లో ఊరూరా బెల్టుషాపులు పుట్టుకొచ్చాయి. గ్రామాల్లో అందుబాటులోనే మద్యం దొరకడంతో యువకులు మద్యానికి బానిసై అనారోగ్యం పాలవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీలుగుమిల్లి మండలం పి.రాజవరంలో మద్యానికి బానిసై అనారోగ్యంతో కాకాని వంశీ (24) మృతి చెందడంతో ఒక్కసారిగా గ్రామస్తులు భగ్గుమన్నారు. మద్యాన్ని నిషేధించాలని రోడ్డెక్కి నినదించారు. బెల్టుషాపులపై దాడులు చేసి మద్యం సీసాలను పగలగొట్టారు.

ఊరూరా యథేచ్ఛగా.. గత ప్రభుత్వ పాలనలో మండల కేంద్రంలో మాత్రమే మద్యం దొరికేదని అయితే ఇప్పుడు ఊరూరా మద్యం దొరకడంతో యువకులు మద్యానికి బానిసై అనారోగ్యం పాలవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పి.రాజవరం గ్రామంలో 200 కుటుంబాలు ఉన్న చోట మూడు బెల్టు షాపులు ఉన్నాయని వాటిని తీసేయాలని చెప్తే తమపైనే దాడులు చేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి మండలంలో సుమారు 12 పంచాయతీలు, 40 గ్రామాలు ఉండగా గ్రామానికి రెండు చొప్పున బెల్ట్‌షాపులు ఏర్పాటు చేశారు. బుట్టాయగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో కూడా బెల్టుషాపులు విచ్చలవిడిగా సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఒక్కో షాపుకు రూ.లక్ష



గతంలో పి.రాజవరంలో మద్యం లేదు. అయితే ఇప్పుడు రూ.లక్ష ఇచ్చి బెల్టుషాపులు పెట్టుకున్నా మని నిర్వాహకులు చెబుతున్నారు. మద్యానికి బానిసై యువకుడు చనిపోయాడు. అతడిని బ్రతికిస్తారా? అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

– రాణి, గ్రామస్తురాలు, పి.రాజవరం, జీలుగుమిల్లి మండలం

బెల్టుషాపులను తొలగించాలి



గ్రామంలో బెల్టుషాపుల ఏర్పాటుతో యువకులు మద్యానికి బానిలై అనారోగ్యం పాలవుతున్నారు. పనులు మాని మద్యాన్ని అధికంగా సేవిస్తూ కనీసం కుటుంబాలను పట్టించుకోవడంలేదు. బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా గ్రామంలో బెల్టుషాపులను తొలగించాలి.

– రాజేష్, యూత్ సంఘం నాయకులు, పి.రాజవరం, జీలుగుమిల్లి మండలం

మద్యానికి బానిసలవుతున్నారు



పి.రాజవరం గ్రామంలో మద్యానికి బానిసలై అనారోగ్యం పాలైన యువకులు అనేక మంది ఉన్నారు. బెల్టుషాపులు అందుబాటులో ఉండడంతో విచ్చలవిడిగా యువకులు మద్యం సేవిస్తున్నారు. గతంలో దూరంగా ఉండేవి. కొద్దో గొప్పో తాగేవారు. ఇప్పుడు మద్యం గ్రామంలోనే దొరకడం వలన పనులు పనులు మానేసి మరీ తాగుతున్నారు.

– కె.ప్రసాద్, గ్రామస్తుడు, పి.రాజవరం, జీలుగుమిల్లి మండలం

ఏరులై పారుతున్న మద్యం



గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బెల్టుషాపుల నిర్వహణతో అనేక మంది యువకులు అనారోగ్యాల పాలవుతున్నారు. పి.రాజవరంలో మృతి చెందిన వంశీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం చెల్లించాలి. గ్రామాల్లో బెల్టుషాపులను పూర్తిగా నిర్మూలించాలి.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

పూలే సంస్కరణలు అనుసరణీయం

కొయ్యలగూడెం: పూలే సంస్కరణలు అనుసరణీయమని, ఆయన అభ్యుదయ భావాలను ఆదర్శంగా తీసుకోవాలని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మిర్యాలగూడలో జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్‌లో బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మ జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ జన్మించారన్నారు. ఆ మహానుభావుల భావాలను పుణికి పుచ్చుకొని ఆచరించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీసీ చైతన్య సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సర్పంచి ముప్పిడి విజయ కుమారి పూలే విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో గొడ్డటి నాగేశ్వరరావు, గంటా శ్రీను, మేకల అన్నవరం, గాడిచర్ల సోమేశ్వరరావు, మారిశెట్టి శ్రీను, కొనకళ్ల రాము, చిటికెన నాగార్జున, గోలిశెట్టి ప్రసాద్, గంటా రమేష్, పసుపులేటి రాంబాబు, ఏలేటి చిన్న తుక్కయ్య, చిటికెన రమేష్, వీరవరపు నివాస్, టి.ఆంజనేయరాజు, మద్దిబోయిన శ్రీను, రాచూరి మదన్, కాసగాని గోఖలే, వీసం రంగా, ముప్పిడి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలేకు నివాళి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య అధ్యక్షతన స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కౌన్సిలర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ పూలే దంపతులు అణగారిన వర్గాలకు చిరస్మరణీయమైన సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి వీరాజంనేయులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బీవీఆర్ చౌదరి, వెంకటరమణమూర్తి, చింత అనిల్ కుమార్ గౌడ్, షేక్ అక్బర్, బత్తిన చిన్న, వాసా రామకృష్ణ, భావన ఋషి, చిప్పాడ వెంకన్న, నేత్రు గణేష్, తల్లాడ శ్రీను, కాటన్ డేవిడ్, కాసర సోమిరెడ్డి, పెసరగంటి త్రిమూర్తులు, రొంగుల నాగేశ్వరరావు, పల్లా వెంకటరమణ, మహమ్మద్ ఆఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: పరింపూడిలో పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



జంగారెడ్డిగూడెం: పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



చింతలపూడి: పూలే విగ్రహానికి పూలమాలు వేస్తున్న బీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతలపూడిలో ఘనంగా పూలే జయంతి వేడుకలు

చింతలపూడి: మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో జ్యోతీరావ్ పూలే జయంతిని స్థానిక మేడబడి వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘం నాయకులు యుఉమా మహేశ్వరరావు అధ్యక్షతన వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పూలేకు నేతలు ఘన నివాళులర్పించారు. అదే విధంగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబునాయక్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.లెనిన్‌బాబు, మేకా ఈశ్వరయ్య, తూము విజయకుమార్, ఎం.ఇమ్మానియేలు, ఎ.సుబ్బారావు, కాటూరి ఏలియ, ఆర్‌వీ సత్యనారాయణ, ఎస్.సూర్యకుమార్, డాక్టర్ పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు జ్యోతిబా పూలే



టి.నరసాపురం: పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

టి.నరసాపురం: బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్దిన సత్యనారాయణ, కాసాని వెంకట్రావు, పాలేటి సత్యనారాయణ, ఎంఆర్‌పీఎస్ నాయకులు నందిపాం దుర్గారావు, పలగాని పోతురాజు, పబ్బు జయరాజు, చిన్నబుజ్జి, సీహెచ్ బాబురావు, ఎస్.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



కామవరపుకోట: పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన జ్యోతిరావు పూల్డే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, బి.వెంకటేశ్వరరావు, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: పూలే గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేస్తున్న హెచ్‌ఎం సురేష్

సామాజిక న్యాయ పితామహుడు పూలే

ద్వారకాతిరుమల: సామాజిక న్యాయ పితామహుడు, సత్యశోధక సమాజ స్థాపకుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని మండలంలోని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.సురేష్ అన్నారు. పాఠశాల ఆవరణలో జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శారద, మల్లయ్య, కుమారస్వామి, రమేష్, ప్రభాకరావు, సుబ్బారావు, పద్మ, కనకరాజు, రాజేశ్వరమ్మ, పద్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మూడో రోజూ కొనసాగిన వార్షికోత్సవం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాలు మూడో రోజు కొనసాగాయి. వీరంకి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పునః పూజలు శ్రీ అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జెట్టి గురునాథం, మండవల్లి సోంబాబు, సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, కమిటీ సభ్యులు శాశ్వత కమిటీ చైర్మన్ కేసరి రామిరెడ్డి, ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, సెక్రెటరీ గంగు జగన్‌మోహన్‌రెడ్డి, కోశాధికారి కూన పార్వతి, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

ద్వారకాతిరుమల: ధాన్యం కొనుగోలులో సిబ్బంది రైతులకు మెరుగైన సేవలు అందించాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. మండలంలోని గుణ్ణంపల్లి గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలుపై గ్రామ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో రమణ మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే రైతులు పంటను కోసి మెట్ట ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గారమేష్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్, గుణ్ణంపల్లి సొసైటీ కార్యదర్శి రాంబాబు, వీహెచ్‌ఏలు జయలక్ష్మి, నిహారిక, సొసైటీ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

మాజీ హోం మంత్రి వనితకు సత్కారం



మాజీ హోం మంత్రి వనితకు పూలబొకేను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ద్వారకాతిరుమల: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనితను తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసం వద్ద, మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఆమె పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యురాలిగా నియమితులైన విషయం తెలిసిందే. దీన్ని పురస్కరించుకుని జి.కొత్తపల్లి ఎంపీటీసీ బిరుదుగడ్డ బజారియ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం, తదితరులు వనితను కలిసి, ఆమెకు దుశ్శాలువా కప్పి, పూలబొకేను అందించి ఘనంగా సత్కరించారు. పున్నపు కృష్ణ, కాజు రవి, పొంగులేటి సంతోష్, దుడ్ల పవన్, రెడ్డి చిన్ని, గంజి నాగార్జున, బోడ అశోక్ పాల్గొన్నారు.

సొసైటీ బంకులకు ప్రాధాన్యం

కొయ్యలగూడెం: సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఆయిల్ బంకులకు ప్రజలు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని అందుకు తగ్గట్టుగా విశ్వసనీయతను సొసైటీలో నిలుపుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ పీఓ కె. రాములు నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్చార్జి డీడీ శ్రీవిద్య, డీవైఈఓ, ఏఎంఓ, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ద్వారకాతిరుమల: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ బ్యూలా అన్నారు. స్థానిక శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఉద్యోగులకు భద్రత కల్పించాలి



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఉద్యోగులకు భద్రత సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో గేటు వద్ద శుక్రవారం ఆర్టీసీ కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిపో సెక్రటరీ డీవీఎస్ఎన్‌టీ రాజు, గ్యారేజ్ సెక్రటరీ టి.ఇశ్రాయేలు మాట్లాడుతూ నేషనల్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం అందించారు. అక్రమ సస్పెన్షన్లు నిలుపుదల చేయాలని, ప్రమోషన్లుత వెంటనే అమలు చేయాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 13వ తేదీ ఆదివారం జంగారెడ్డిగూడెం సూర్య కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జీబీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. శిబిరంలో జీబీఆర్ ఫౌండేషన్ న్యూరో ఫిజిషన్ డాక్టర్ గోపాలం శివన్నారాయణచే ఫిట్స్ (మూర్ఛ), పెరాలసిస్ (పక్షవాతం) వ్యాధిగ్రస్తులను పరీక్షించి నాలుగు నెలలకు సరిపడా మందులు ఇస్తారన్నారు. మందులకు రూ. 500 చెల్లించాలన్నారు. వివరాలకు 9652264744, 7075914707 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా డ్రైడే-ఫ్రైడే

కొయ్యలగూడెం: రామానుజపురం గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్యవిస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులు ప్రబలుతాయని, మురుగు నీరు నిల్వ ఉంటే దోమలు విపరీతంగా పెరుగుతాయన్నారు. దోమలు డెంగీ, మలేరియా, ఫైలేరియా వ్యాధులు కలగజేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ బి.యువరాజు, ఏఎన్ఎమ్ బి.సోమలమ్మా, హెల్త్ అసిస్టెంట్ ఎస్‌కే మహబూబ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించే వారికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మండలంలోని గుణ్ణంపల్లి పంచాయితీ, తక్కెళ్ళపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అమర్‌నాథ్ వినాయక కల్కి సాయి రైస్ ఇండస్ట్రీస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండస్ట్రీస్ యజమానులు కోనా శ్రీనివాసరావు, కోనా హనుమాన్ బాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వైద్య పరికరాల వితరణ



వైద్యపరికరాలు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

టి.నరసాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరికరాలను జంగారెడ్డిగూడెం నవభారత్ పామాయిల్ కంపెనీ శుక్రవారం ఉచితంగా అందజేసింది. ఈ విషయాన్ని ఆ కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. 68 రకాల వైద్య పరికరాలు, ఆసుపత్రి సామగ్రిని అందించినట్టు వారు తెలిపారు. కంపెనీ ఉద్యోగులు, గ్రామ పెద్దలు, వైద్యులు పాల్గొన్నారు.

పోరాటాలు తీవ్రతరం చేయాలి

జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు ధర్మల సురేష్ పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర నాయకులు పైలా వాసుదేవరావు 15వ వర్ధంతిని జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు.

వాసుదేవరావు వర్ధంతి సభ

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరులో పైడా వాసుదేవరావు 15వ వర్ధంతి సభను నడపల ముక్కారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వాసుదేవరావు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకురాలు కుర్సం లత, సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
90102 23729
70754 60815
Office mail : tpgadvt@gmail.com